క్లుప్తంగా

శ్రీకృష్ణుడి శోభాయాత్ర



దుగ్గొండి : త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో మండలంలోని లక్ష్మీపురంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీకృష్ణుడి శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. పురవీధులు భక్తుల భజనలతో మార్మోగాయి. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఓం ప్రకాశ్, కిరణ్, హనుమయ్య, శరత్, కట్టయ్య, పద్మ, నిర్మల, రావణాచారి, విక్రమాచారి, అక్షయ, రోహిణి, శ్రీముఖి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



నర్సంపేట : పట్టణంలోని పోచమ్మ ఆలయంలో ఆదివారం ఘనంగా బోనాలు పండుగ నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ నాయకులు దేవండ్ల రాంబాబు, కొలువుల వెంకటేశ్‌తోపాటు టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ ఓర్సు తిరుపతి, పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ పాలాయి రవికుమార్, మాజీ సర్పంచ్ చిలువేరు రజని భారతి, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి బైరి మురళి, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రవి, కార్యదర్శులు గిరగాని రమేశ్, మోటం రవి, పిన్నింటి కిరణ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజేందర్



దుగ్గొండి : సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని నాచినపల్లికి చెందిన పుట్టపాక రాజేందర్ ఎన్నికయ్యారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో విలేకరులతో రాజేందర్ మాట్లాడారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, రాష్ట్ర, జిల్లా, డివిజన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధం



పర్వతగిరి : మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన కత్తి బుచ్చిరాములు పూరి గుడిసె ఆదివారం షార్ట్‌సర్క్యూట్ చోటు చేసుకుని దగ్ధమైంది. బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్ పరామర్శించారు. ఎమ్మెల్యే నాగరాజు సహకారంతో నిత్యావసర సరుకులు, బియ్యం, దుస్తులు, ఆర్థికసాయం అందజేశారు. గుడిసె దగ్ధంపై తహసీల్దార్ వెంకటస్వామి విచారణ చేపట్టారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని అక్కల్‌చెడకు చెందిన బాదావత్ రవికుమార్ మంజూరైన రూ.16 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ ఆదివారం పంపిణీ చేశారు. అనంతరం గోపాల్ మాట్లాడారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో రవికుమార్‌కు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైందని చెప్పారు. ప్రజలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పులిశేరు రాజేందర్, మాజీ సర్పంచ్ తూటి పావని రమేశ్, మాజీ ఉపసర్పంచ్ భానోతు వీరన్ననాయక్, నాయకులు బాదావత్ పెద్ద వీరు, ముత్యం భద్రయ్య, తేజావత్ భద్రు, మైనార్టీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

వనభోజనాలు

ఐనవోలు : మండలంలోని ఉడుతగూడెంలోని ఓ రిసార్ట్‌లో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రశాంత్‌నగర్ వాసులు శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం వనభోజనాలు నిర్వహించారు. ప్రముఖ మెజీషియన్ శ్రీనివాస్‌రెడ్డి ఆటల పోటీలు నిర్వహించారు. ఆటాపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్, నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అధిక తేమ.. పంటలకు చేటు

● మండల వ్యవసాయ అధికారి సాగరిక



సంగెం : ప్రస్తుత అధిక వర్షాల పరిస్థితుల్లో అధిక తేమ.. పంటలకు చేటు కల్పిస్తుంది. సమగ్ర యాజమాన్య పద్ధతులతో పంటల రక్షణ సాధ్యం. పత్తి, మొక్కజొన్న తదితర పంట పొలాల్లో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నీరు బయటకు వెళ్లేలా కాల్వలు ఏర్పాటు చేయాలి. మండల వ్యవసాయ అధికారి సాగరిక సూచనలు, సలహాలు..

వరి పంట సాగు

మండలంలో బావుల కింద వరి నాట్లు పూర్తి కాగా పలు గ్రామాల్లో చెరువులు, కుంటల కింద కొనసాగుతున్నాయి. వరి నారు పోసి 120–125 రోజుల స్వల్పకాలిక రకాలను నేరుగా డ్రమ్ సీడర్, నేరుగా వెదజల్లే పద్ధతిలో ఆగస్టు చివరి వరకు విత్తుకోవచ్చు. నీటి ముంపునకు గురైన వరి పొలాల్లో సల్ఫైడ్ దుష్ప్రభావం అశించేందుకు అనుకూలం. దీన్ని అధిగమించేందుకు వరి పంట మొక్క వేర్లకు గాలి తగిలేలా మురుగు నీరు తొలగించాలి. పొలంలో నెర్రెలొచ్చే వరకు ఆరబెట్టాలి. 25 నుంచి 30 రోజుల వయస్సున్న వరి నారును ఈనెలాఖరు వరకు నాటు వేయొచ్చు. దీర్ఘకాలిక వరి రకాల నారు నాటు వేయడం ఆలస్యం అయినపుడు 50 రోజుల వయస్సున్న నారు ఆకుల చివర్లను తుంచి కుదురుకు 5, 6 మొక్కల చొప్పున చదరపు మీటరకు 66 మొక్కలు ఉండేలా 15–10 ఇంచుల ఎడంతో నాటాలి. కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులు ఆశించకుండా వరి పొలం గట్ల వెంట కలుపు లేకుండా శుభ్రంగా ఉంచాలి.



నీరు నిలిచిన పత్తి పంట



నీట మునిగిన వరి పొలం

పత్తి పంటలో..

మండలంలో పత్తి ప్రస్తుతం పూత, పిందె, కాయ అభివృద్ధి చెందే దశలో ఉంది. ముంపునకు గురైన పత్తి పంటలను వడలు తెగులు ఆశించే అవకాశం ఉంది. నీటిని చేలల్లోంచి తీసివేయాలి. వర్షం తగ్గిన తర్వాత పంట త్వరగా కోలుకునేలా పాలిఫీడ్ (19:19:19) లేదా మల్టికె (13:0:45) లేదా నానో యూరియా కలిపి వారం రోజుల వ్యవధిలో 2–3 సార్లు పిచికారీ చేయాలి. తెగుళ్ల నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా 2 గ్రాముల కార్బండజిమ్‌తోపాటు మ్యాంకోజేబ్ శిలీంద్ర నాశినిని లీటరు నీటికి కలిపి నేల బాగా తడిచేలా వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. వర్షాలు తగ్గిన తర్వాత ఎకరాకు 25 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రసాయనిక ఎరువులను పైపాటుగా 20, 40 రోజుల వయస్సు పంటలకు మొక్కల మొదళ్లలో 7–10 మీటర్ల దూరంలో పాదులు తీసి రసానిక ఎరువులను మట్టితో కప్పాలి.

మొక్కజొన్న సాగులో..

ప్రస్తుతం మొక్కజొన పంట కంకి, గింజ అభివృద్ధి దశలో ఉంది. మొక్కజొన్న శాకీయ దశలో ఎక్కువ నీటిని తట్టుకోలేదు. కాబట్టి నీరు నిల్వకుండా నీటిని తొలగించాలి. అధిక వర్షాలతో నేలల్లో భాస్వరం లోపం ఏర్పడి మొక్కలన్నీ ఊదారంగులోకి మారే ప్రమాదం ఉంది. వర్షాలు నిలిచిన తర్వాత 5 గ్రాముల 19:19:19 లేదా నానో డీఏపీ కలిపి పిచికారీ చేయాలి. 20 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్‌ను ఎకరాకు పైపాటుగా వేయాలి.

కంది పంటలో..

ముంపునకు గురైన పంటలను ఎండుతెగులు ఆశించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. తెగుళ్ల గమనించిన వెంటనే వర్షం తగ్గిన తర్వాత ఎండుతెగులు నివారణకు 2 గ్రాముల మెటాలాక్సిల్ మందును లీటరు నీటిలో కలిపి మొక్క మొదళ్ల బాగా తడిచేలా పిచికారీ చేయాలి.

కూరగాయలకు తెగుళ్లు..

అధిక వర్షాల వల్ల టమాట, వంగ, మిరప, బంతి నారు మళ్లల్లో నారు కుళ్లు తెగులు సోకే అవకాశం ఉంది. నివారణ కోసం 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటర్ నీటికి కలిపి నేల పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలి.

యువత సన్మార్గంలో పయనించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై రఘుపతి

● ఎస్సై రఘుపతి

ఖానాపురం : యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో పయనించాలని ఎస్సై రఘుపతి కోరారు. మండలంలోని బుధరావుపేటలో పోలీస్ జాగృతి కళాబృందం ఆధ్వర్యంలో డ్రగ్స్, గంజాయి, గుట్కా, తదితర మత్తుపదార్థాల నిర్మూలపై ఆదివారం నిర్వహించిన కళాజాతకు ఎస్సై హాజరై మాట్లాడారు. సమాజ ఉన్నతిలో యువజన పాత్ర కీలకమన్నారు. యువత ఇతరులకు ఆదర్శప్రాయులుగా నిలిచేలా వ్యవహరించాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలను కోరారు. గంజాయి వంటి మత్తు పదార్థాల నిర్మూలనలో యువజన భాగస్వామ్యం కీలకమన్నారు. మత్తు పదార్థాల విక్రయాలు, బాల్యవివాహాలపై పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు. కార్యక్రమంలో జాగృతి ఇన్‌చార్జ్, ఏఎస్సై నాగమణి, సభ్యులు విలియమ్స్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, హోంగార్డులు శ్రీనివాస్, విక్రం, రాజు, నారాయణ, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో రైతులకు నష్టం

● రాష్ట్ర కమిటీ సభ్యుడు కుమారస్వామి

నర్సంపేట : కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలంగాణ రైతు సంఘం రాష్ట కమిటీ సభ్యుడు కోరబోయిన కుమారస్వామి తెలిపారు. మండలంలో దెబ్బతిన్న వరి పంటలను ఆయన ఆధ్వర్యంలో ఆదివారం పరిశీలించి నష్టాన్ని అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడారు. భారీ వర్షాలకు డివిజన్‌వ్యాప్తంగా వరి పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. వందలాది ఎకరాల్లో ఇసుక మేటలు వేసిందన్నారు. ఎకరాకు సుమారు రూ.15 వేల పెట్టుబడి పెట్టిన రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. నష్టపోయిన పంటలను అంచనా వేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి వ్యవసాయ అధికారులతో పంటల నష్టం అంచనా వేయించి ఎకరాకు రూ.30 వేల చొప్పున బాధిత రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, రైతులు వాగ్య, ఈరు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న కుమారస్వామి, తదితరులు

కాంగ్రెస్ హయాంలోనే ప్రజల అభివృద్ధి



పార్టీలో చేరిన వారితో తిరుపతిరెడ్డి

● మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి

నల్లబెల్లి : కాంగ్రెస్ హయాంలోనే ప్రజలు అభివృద్ధి చెందుతారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని నారక్కపేటకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో పేదలకు ఇళ్లు కట్టించలేదని, రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల హామీల అమలుకు ప్రణాళికాయుతంగా కార్యాచరణ చేపట్టిందని తెలిపారు. గతంలోనూ కాంగ్రెస్ హయాంలోనే భూములు, ఇళ్ల పంపిణీ జరిగిందని చెప్పారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు అవుతాయని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలన పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం పార్టీని ప్రజలు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్, నాయకులు శేఖర్, సుమన్, కుమారస్వామి, రమేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

రంగాయ చెరువులో జలకళ



నల్లబెల్లి : మండలంలోని రంగాయ చెరువులో జలకళ సంతరించుకుంది. చెరువు పూర్తిస్థాయి నీటి మట్టం 17 ఫీట్లు కాగా ఆదివారం పూర్తిగా నిండుకుని మత్తడి పోస్తోంది. చెరువు కింద అధికారికంగా 1500 ఎకరాలు సాగు అవుతుండగా అనధికారికంగా మరో సుమారు వెయ్యి ఎకరాల్లో పంటలు సాగు అవుతున్నట్టు తెలుస్తోంది. చెరువు నిండుకుండలా మారి మత్తడి పోస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఊర చెరువు కట్టకు గండి



పర్వతగిరి : కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మండలంలోని అన్నారం ఊర చెరువు కట్టకు ఆదివారం గండి పడింది. వర్షాలకు చెరువు కట్ట మట్టి కొట్టుకుపోయింది. వెంటనే గండి పూడ్చకపోతే పంట పొలాలు నీట మునిగే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి గండి పూడ్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.

యూరియా పంపిణీలో ప్రభుత్వాలు విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

● ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి రమేశ్

నర్సంపేట : రైతులు అవసరమైన మేరకు యూరియా పంపిణీ చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ తెలిపారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో గటిక జమున అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన డివిజన్ కమిటీ సమావేశానికి రమేశ్ హాజరై మాట్లాడారు. ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో రైతులకు ఎరువులు, రుణాలు అవసరం ఉండగా సమకూర్చడంలో ప్రభుత్వాలు చిత్తశుద్ధి చూపడం లేదన్నారు. ప్రభుత్వాల తప్పుడు విధానాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దళారులు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నా చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకపోవడంతో బ్యాంకర్లు పంట రుణాలు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారని తెలిపారు. అధిక వర్షాలతో నీరు నిలిచి దోమలు, ఇతర క్రిమికీటకాలు వ్యాపించి సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు పడుతుండగా ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు. పార్టీ డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజా సాహెబ్ మాట్లాడుతూ స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, రైతులకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న ఆర్డీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట నాయకులు కన్నం వెంకన్న, కుసుంబ బాబురావు, నాగెల్లి కొమురయ్య, డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, డివిజన్ నాయకులు కౌెట్టి సదానందం, కలకోట్ల యాదగిరి, దామ సాంబయ్య, బుడిమె సురేందర్, కర్నె సాంబయ్య, మార్త నాగరాజు, బత్తిని కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పెంపునకు ఉద్యమాలు తప్పవు

● ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్‌లు గోపాల్, ధర్మయ్య

రాయపర్తి : వృద్ధులు, వికలాంగులు, వితంతువుల పింఛన్ పెంపు కోసం ఉద్యమాలు తప్పవని ఎంఆర్‌పీఎస్ మండల ఇన్‌చార్జ్‌లు మాసాని గోపాల్, జిల్లా ధర్మయ్య స్పష్టం చేశారు. మండలంలోని మైలారంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు పింఛన్ పెంచాల్సి ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సుమారు రెండేళ్లు కావస్తున్న నేపథ్యంలో ఇకనైనా పింఛన్ పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమాలు తప్పవని స్పష్టం చేవారు. ఈనెల 28న వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో నాలుగు మండలాల వృద్ధులు, వితంతువులు, వికలాంగుల సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. తొలుత గ్రామంలో వికలాంగులు, వితంతువులు, వృద్ధులతోపాటు గీత, బీడీ, చేనేత కార్మిక పెన్షనర్లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వర్ధన్నపేట మండల ఇన్‌చార్జ్ ఐత రాజు, మండల ప్రధాన కార్యదర్శి గారె నరేశ్, వికలాంగుల సంఘం అధ్యక్షుడు చిర్ర దర్గయ్య, నాయకులు చిర్ర బాలయ్య, గాడిపెల్లి వెంకటయ్య, చిర్ర యాకయ్య, చిర్ర వీరమ్మ, చిర్ర అంజయ్య, ఎల్లమ్మ, జలగం ఉప్పలమ్మ, గాడిపెల్లి చిన్న వెంకటయ్య, చిర్ర బుచ్చమ్మ, గాడిపెల్లి యాకమ్మ, గాడిపెల్లి పాపయ్య, తాటికాయల వెంకటయ్య, జిల్లా సూరి, సంకినేని సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్

కాజ్‌వేపై తగ్గిన నీటి ఉధృతి



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని పాత ముగ్దుంపురం గ్రామ శివారులోని నర్సంపేట–నెక్కొండ ప్రధాన రహదారిలోని లో లెవల్ కాజ్‌వేపై నీటి ఉధృతి తగ్గింది. భారీ వర్షాలకు లో లెవల్ కాజ్‌పై నీటి ఉధృతితో శనివారం రాకపోకలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. కాగా వరద నీరు తగ్గుముఖం పట్టడంతో ఆదివారం రాకపోకలు కొనసాగాయి. ఈ సందర్భంగా మండల స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణ, తహసీల్దార్ మహ్మద్ ఆబిద్ అలీ, ఎంపీడీఓ నల్ల శ్రీవాణి లో లెవల్ కాజ్‌వేను సందర్శించి ప్రత్యక్షంగా పరిశీలించారు.

‘స్పెషల్ బీఈడీ’లకు న్యాయం చేయాలి

● సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్

వర్ధన్నపేట : స్పెషల్ బీఈడీ అభ్యర్థులకు న్యాయం చేయాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట అధ్యక్షుడు గిద్దె రాజేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఉప్పరపల్లిలో ఆదివారం నిర్వహించిన జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 2024లో చేపట్టిన డీఎస్సీ నియామకాల్లో పలువురు స్పెషల్ బీఈడీ అభ్యర్థులకు ఉద్యోగం రాలేదని చెప్పారు. స్పెషల్ బీఈడీ అభ్యర్థులతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని విమర్శించారు. స్పెషల్ బీఈడీ అభ్యర్థులందరికీ ఉద్యోగం రావాలన్నారు. లేనిపక్షంలో ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో సమితి రాష్ట ఉపాధ్యక్షుడు కొల్లూరి ఈదయ్య బాబు, జిల్లా అధ్యక్షుడు మహ్మద్ షరీఫ్, జిల్లా మహిళ అధ్యక్షురాలు రమాదేవి, నాయకులు ఇస్లావత్ బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్

ప్రథమ మహాసభను జయప్రదం చేయాలి

● సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర సూరి

వర్ధన్నపేట : ఈనెల 25, 26 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో తలపెట్టిన అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) రాష్ట్ర ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర సూరి కోరారు. పట్టణంలో సంఘం జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో మహాసభ వాల్‌పోస్టర్లను నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పాలక పార్టీలు విఫలం అయ్యాయని చెప్పారు. రైతులకు సకాలంలో యూరియా అందించకుండా ఇబ్బందుల పాల్జేస్తున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. రైతు సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తున్న బూర్జువా ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పేలా రైతులు సంఘటితంగా ఉద్యమించాలని కోరారు. మహాసభలో భవిష్యత్ ఉద్యమ కార్యాచరణకు రూపకల్పన చేస్తామన్నారు. మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మైదం పాణి, జిల్లా కమిటీ సభ్యులు మోహన్, బాబురావు, రమేశ్, యాదగిరి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సూరి, తదితరులు

‘ఓటు చోరీ’పై నిరసన

ఆత్మకూరు : ‘ఓటు చోరీ’ ఘటనపై యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యం మండల కేంద్రంలో ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీధర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సందీప్, మాజీ సొసైటీ చైర్మన్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం శిక్షణ తరగతులు

ఖిలా వరంగల్ : వరంగల్‌లోని సీపీఎం జిల్లా ప్రధాన కార్యాలయంలో జిల్లా కార్యదర్శి రంగయ్య ఆధ్వర్యంలో ఆదివారం శిక్షణ తరగతులు కొనసాగాయి. జిల్లా కార్యదర్శి రంగయ్య, నాయకుడు అరూరి రమేశ్ తరగతి బోధించారు. కార్యక్రమంలో నాయకులు గున్నాల ప్రభాకర్, రమేష్, పోరుమాటి శివ, అప్పాజీ వాణి, మూడేడ్ల ఉపేందర్, ఆలం, జుబేదా, మీర్ సాజియా తదితరులు పాల్గొన్నారు.

‘స్థానికం’లో గెలుపే లక్ష్యం

దామెర : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దుర్శెట్టి భిక్షపతి కార్యకర్తలకు సూచించారు. మండల కేంద్రంతో పాటు ల్యాదెళ్లలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గడపగడపకు వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు పోశాలు, రవి, కుమార్, నగేష్, మల్లయ్య, హరీష్ , రవియాదవ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణి మాంసం స్వాధీనం

కొత్తగూడ : వన్యప్రాణిని వేటాడి వండుకుని తినేందుకు యత్నిస్తున్న వారి నుంచి అటవీ శాఖ అధికారులు ఆదివారం మాంసం స్వాధీనం చేసుకున్నారు. ఎఫ్‌ఆర్‌ఓ వజరహత్ కథనం ప్రకారం.. మండలంలోని దుర్గారం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు సమీప అటవీ ప్రాంతంలో ఉచ్చులు వేసి కనుజు (మెకం)ను వేటాడి మాంసం విక్రయించారని సమాచారం మేరకు తనిఖీ చేపట్టారు. మాంసంతోపాటు వేటాడేందుకు ఉపయోగించిన ఇనుప వైర్‌ను స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. వన్యప్రాణులను వేటాడేందుకు యత్నిస్తే కేసు నమోదు చేయడంతోపాటు పోడు భూములను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.

ఆర్టీసీ ప్రాంగణాన్ని సీసీ చేయించాలి



నాటు వేసి నిరసన తెలుపుతున్న నాయకులు

గూడూరు : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో సీసీ వేయించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా సహాయ కార్యదర్శి ఉపేందర్ కోరారు. భారీ వర్షాల వల్ల బస్టాండ్ ప్రాంగణం జలమయమై, బురదగుంతలుగా తయారు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా ఆ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం వరినాటు వేసి నిరసన తెలిపారు. ఆర్టీసీ అధికారులు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఈసం రామయ్య, కటకం బుచ్చిరాములు, సత్తయ్య, రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.